## క్లుప్తంగా

### ఎమ్మెల్యే నాగరాజుకు సన్మానం



వర్ధన్నపేట : స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పట్టణానికి చెందిన నందిపాక భాస్కర్ శనివారం శాలువాతో సత్కరించారు. అనంతరం మున్సిపాల్టీ అభివృద్ధికి రూ.15 కోట్లు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. అనంతరం భాస్కర్ మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించడానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, మైస సురేశ్, అఫ్సర్, అన్వర్, సుధాకర్, శ్రీధర్, శ్రీనివాస్, సుధీర్, రవీందర్, రామకృష్ణ, రాజు, పాపారావు, కీమా నాయక్, భిక్షపతి, వెంకట్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

**హెచ్‌డబ్ల్యూఓ ఉద్యోగం పొందిన వ్యక్తికి..**



నర్సంపేట : పట్టణంలోని కాకతీయ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తూ గ్రూప్–2 పరీక్షలో ప్రతిభ చాటి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూఓ) ఉద్యోగం సాధించిన ఆకుల రాజశేఖర్‌ను ప్రిన్సిపాల్ మాధవరెడ్డి, ఏట వీరారెడ్డి శాలువాతో సన్మానించారు. రాజశేఖర్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

### చేపల వలకు చిక్కిన భారీ కొండచిలువ



వర్ధన్నపేట : చేపల వలకు భారీ కొండ చిలువ చిక్కిన ఘటన మండలంలోని కట్ర్యాల చెరువు వద్ద శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జాలర్లు చేపలు పడుతుండగా ఒకరి వలకు పెద్ద సైజులో ఉన్న కొండచిలువ చిక్కింది. స్థానికుల సాయంతో జాలర్లు వలను బయటకు తీయగా కొండ చిలువ చనిపోయి ఉంది.

**అమీన్‌సాగర్ చెరువులో..**

నర్సంపేట : చేపల వలకు కొండ చిలువ చిక్కిన ఘటన చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్‌లో శనివారం చోటు చేసుకుంది. శంకరంతండాకు చెందిన అజ్మీర నాక అమీనాబాద్ శివారులోని అమీన్‌సాగర్ చెరువులో చేపల కోసం కచ్చు వల వేశాడు. ఈ క్రమంలో వలను తీస్తుండగా కొండ చిలువ బయటికి వచ్చింది. కాగా కొండ చిలువ అప్పటికే వలలో చనిపోయి ఉంది.

### లంబాడీ జేఏసీ ఎన్నిక



నర్సంపేట : లంబాడీ జేఏసీ డివిజన్ కన్వీనర్ డాక్టర్ జాటోతు ఉదయ్‌సింగ్, కోకన్వీనర్ ఆంగోతు భద్రయ్య, తేజావత్ వాసునాయక్, భూక్య జగన్‌నాయక్, గుగులోతు కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో చెన్నారావుపేట మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బోడ మురళీనాయక్, ప్రధాన కార్యదర్శిగా మూడు రమేశ్, ఉపాధ్యక్షుడుగా గుగులోతు కిరణ్, గౌరవ సలహాదారులుగా భానోతు పత్తినాయక్, భానోతు లాల్‌సింగ్, భూక్య రవీందర్, బోడ సమ్మునాయక్, ఆంగోతు వీరాసింగ్, భానోతు గణేశ్, భూక్య కిషన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడారు. లంబాడీ జాతి ఐక్యతను చాటుతామన్నారు. సమావేశంలో నాయకులు గుగులోతు రాజేందర్, ధారావత్ రమేశ్, గుగులోతు రమేశ్, గుగులోతు విజేందర్, ధరావత్ రఘు, పాల్గొన్నారు.

### ఆర్థికసాయం

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన తాటికొండ నాగభూషణం అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆయన పదో తరగతి నాటి మిత్రులు రూ.26 వేల సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, నాగభూషణం స్నేహితులు మారపాక సుధాకర్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### అనుమతి లేని ఫంక్షన్ హాల్ కూల్చివేత

ఐనవోలు : మండలంలోని పంథినిలో అనుమతి లేకుండా నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను పంచాయతీ అధికారులు శనివారం కూల్చివేశారు. కార్యదర్శి మాలతీ కథనం ప్రకారం.. మారెమ్మ వాగు ఒడ్డున అనుమతి లేకుండా ఫంక్షన్ హాల్ నిర్మించారు. నోటీసులు అందజేసిన స్పందించకపోవడంతో కోర్టు ఆదేశాల మేరకు పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేసినట్లు తెలిపారు.

# గ్రామీణ రోడ్లకు మోక్షమెప్పుడో?

● అంతర్గత రహదారులు అధ్వానం

సంగెం : గ్రామీణ రోడ్లకు మోక్షమెప్పుడో? అని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు లింకు రోడ్లు, గ్రామాల్లోని అంతర్గత రోడ్లు పూర్తి అధ్వానంగా తయారయ్యాయి. గవిచర్ల నుంచి తీగరాజుపల్లి, తిమ్మాపూర్ నుంచి ఎల్గూర్ స్టేషన్, ఎల్గూర్ రంగంపేటలోని మొండ్రాయి వెళ్లే రహదారులు గుంతలమయంగా మారాయి. ఏటా వర్షాకాలంలో చిరు వర్షానికి సైతం బురదమయమై ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లే పలువురు వర్షపు నీటి గుంతల్లో లోతు తెలియక అదుపు తప్పి కింద పడిపోయి ఆస్పత్రి పాలవుతున్న దుస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి పాడైపోయిన రోడ్ల గురించి సంబంధిత ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతోపాటుగా పాలకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

**గ్రామాల్లో రోడ్లు ఇలా..**

మండలంలోని తిమ్మాపూర్ నుంచి ఎల్గూర్ రంగంపేట ఊరు చివర వరకున్న ఒకటిన్నర కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. అలాగే తిమ్మాపూర్ నుంచి ఎల్గూర్ స్టేషన్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల బీటీ రోడ్డు సైతం గుంతలమయం కావడంతో వాహనదారులు నర్సాపూర్ మీదుగా రెండు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. గవిచర్ల నుంచి తీగరాజుపల్లి వరకు, సంగెంలోని చెరువు కట్ట మలుపు వద్ద గుంతలు పడి ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. చింతలపల్లి నుంచి మొండ్రాయి వరకు వేసిన నూతన బీటీ రోడ్డు అనతి కాలంలోనే గుంతలమయమైంది.ఆశాలపల్లి క్రాస్ నుంచి ఆశాలపల్లికి వెళ్లే రోడ్డు సీసీ సగానికి వేసి వదిలేశారు. కొత్తగూడెం నుంచి గవిచర్లకు వేసిన రోడ్డుపై బీటీ వేయకపోవడంతో రైతులు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. సంగెంలోని ఆస్పత్రి నుంచి కుంటపల్లి బైపాస్ రోడ్డు గుంతమయమై నడక సైతం కష్టతరంగా మారింది. బీకోజీనాయక్ తండా నుంచి బాలునాయక్ తండాకు వెళ్లే రోడ్డు, వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టక, పనులు సకాలంలో సాగక రైతులు పొలాలకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. తీగరాజుపల్లి నుంచి షాపూర్ రోడ్డుకు, గుంటూరుపల్లి నుంచి బొల్లికుంటకు వెళ్లే రోడ్డుకు కంకర పోసి బీటీ వేయడాన్ని విస్మరించారు.



ఎల్గూర్ రంగంపేటలో ధ్వంసమైన బీటీ రోడ్డు

**అడుగడుగునా గుంతలు**

ఎల్గూర్ రంగంపేటలోని అన్ని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అడుగడుగునా గుంతలమయం పడ్డాయి. అడుగు తీసి అడుగు వేయలేని దురిస్థితి దాపురించింది. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచింది. బతుకమ్మ పండుగ ఎలా జరుపుకోవాలో తెలియడం లేదు.

– రావుల పద్మ, ఎల్గూర్‌రంగంపేట వాసి

**ప్రతిపాదనలు అందజేశాం**

మండలంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము. కొన్ని రోడ్లకు నిధులు మంజూరై పనులు జరుగుతున్నాయి. మరికొన్నిటిని ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి సమస్యలు పరిష్కరిస్తాం.

– అభిరామ్, పీఆర్ ఏఈ

## యూరియా కోసం తప్పని తిప్పలు



దుగ్గొండి : జోరువానలోనూ బారులుదీరిన రైతులు



సంగెం : రైతు తలకు కుట్లు వేస్తున్న వైద్యసిబ్బంది

దుగ్గొండి/సంగెం : యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. దుగ్గొండి మండలంలోని గ్రోమోర్ సెంటర్‌కు 220 బస్తాల యూరియా వచ్చిన విషయమై దావానలంలా వ్యాపించడంతో గిర్నిబావి పీఏసీఎస్ వద్ద రైతులు కూపన్ల కోసం శనివారం తెల్లవారుజామున జోరువానలోనూ నాలుగు గంటలకే బారులు తీరారు. కాగా ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి పర్యవేక్షణలో రైతులకు కూపన్లు అందించగా సగం మంది రైతులకు మాత్రమే ఒకటి చొప్పు యూరియా బస్తా లభించింది. అలాగే సంగెంలోనూ తెల్లవారుజాము నుంచే రైతులు క్యూకట్టారు. తోపులాట చోటు చేసుకోగా నల్లబెల్లి శివారులోని జగ్గునాయక్‌తండాకు చెందిన గుగులోతు రవి అదే సమయంలో ఫిట్స్‌తో కింద పడిపోయాడు. ఆయన తలకు తీవ్ర గాయం కాగా స్థానిక పీహెచ్‌సీలో కుట్లు వేసి ప్రథమ చికిత్స అందించి 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

### కాంగ్రెస్‌లో పలువురి చేరిక



సంగెం : మండలంలోని కుంటపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నివాసంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్‌లో చేరగా వారికి ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఉపసర్పంచ్ గోపతి సారంగం, నాయకులు గోపతి సుధాకర్, కావటి సాంబయ్య, చిర్ర అనిల్, రాగిరి నాగరాజు, కడ్దూరి రవితేజ, ప్రశాంత్, జక్కు అశోక్, రాయపురం భిక్షపతి, ఏషబోయిన రవి, చిర్ర సంపత్‌లను అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెంతల ప్రతాప్, నాయకులు నాగరాజు, కిశోర్, జగన్నాథచారి, వెంకటయ్య, జున్న యాకయ్య, రాజ్‌కుమార్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మణ్ బాపూజీ జయంతి



సంగెం : మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నరహరి లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై కొండా లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కొండా లక్ష్మణ్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బిట్ల సత్యనారాయణ, నాయకులు మెట్టుపల్లి మల్లయ్య, గుండేటి ఎల్లయ్య, బాబు, ఆగపాటి రాజు, మోహన్, పులి సాంబయ్య, రమేశ్, ప్రకాశ్, వీరస్వామి, దశరథం, మనోహర్, పేరాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఖబ్రస్థాన్‌కు భూకేటాయింపు

గీసుకొండ : మండలంలోని వంచనగిరి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 67/2లో ముస్లింల ఖబ్రస్థాన్ కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు భూమి కేటాయించారు. ఈ సందర్భంగా ముస్లిము మత పెద్దలు రహీమ్, నజీర్ మీడియాతో మాట్లాడారు. మండలంలోని కోనాయమాకుల, వంచనగిరి, శాయంపేట, అనంతారం, గీసుకొండ, జాన్‌పాక, ఆదర్శనగర్ గ్రామాలకు చెందిన ముస్లింలు మృతదేహాల ఖననానికి ఉపయోగపడేలా భూమిని కేటాయించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని, కలెక్టర్‌ను, తహసీల్దార్ రియాజుద్దీన్‌ను తాము కోరగా సానుకూలంగా స్పందించారని చెప్పారు.

## వర్షాలతో పంటలకు భారీ నష్టం



దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

● బీఆర్ఎస్ నాయకులు ప్రకాశ్, శ్రీనివాస్

ఖానాపురం : వరుసగా కురుస్తున్న వర్షాలతో మండలంలో పంటలకు భారీ నష్టం వాటిల్లుతోందని బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో వర్షాలతో దెబ్బతిన్న మొక్కజొన్న, పత్తి పంటలను బీఆర్ఎస్ నాయకులు శనివారం పరిశీలించి నష్టాన్ని అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌రావు, శ్రీనివాస్ మాట్లాడారు. వర్షాలు రైతులకు తీరని వేదన కలిగిస్తున్నాయని చెప్పారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, వ్యవసాయ శాఖ అధికారులతో తక్షణమే సర్వే చేయించాలని, బాధిత రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటనర్సయ్య, నాయకులు బందారపు శ్రీనివాస్, ఆబోతు అశోక్ యాదవ్, మౌలానా, బాలు, బాలకిషన్, వెంకన్న, రాజు, పూలునాయక్, రామస్వామి, అశోక్, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పరిహారం అందించాలి



దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని ఎంసీపీఐ(యూ) నాయకులు వంగాల రాగసుధ, కొత్తకొండ రాజమౌళి, కేశెట్టి సదానందం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సంపేట మండలంలోని మాధన్నపేటలో కొద్ది రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాలకు దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న పంటలను వారు సందర్శించి మాట్లాడారు. పంటలు దెబ్బతినడంతో రైతులు వేదనకు గురౌతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనుమాల రమేశ్, కందికొండ సాంబయ్య, గుర్రం రవి, ఆకుల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరికి గాయాలు

ఐనవోలు : ఆగి ఉన్న గ్రానైట్ లారీని ఆటో ఢీకొట్టిన ఘటన మండలంలోని వరంగల్–ఖమ్మం రహదారి పంథిని శివారులో చోటు చేసుకుంది. లారీ ఎయిర్ బ్రేక్ కావడంతో రోడ్డుపై డ్రైవర్ నిలిపివేయగా వర్ధన్నపేట నుంచి వరంగల్ దిశగా వెళ్తున్న ఆటో రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మండలంలోని పెరుమాండ్లగూడెంకు చెందిన పెండ్లి అనంతరెడ్డి, రాయపురం అరవింద్ గాయాల పాలయ్యారు.

## అధికార పార్టీలకు ఓటడిగే హక్కులేదు

● ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

సంగెం : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన అనంతరం విస్మరించిన అధికార పార్టీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను ఓటడిగే హక్కు లేదని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ అన్నారు. మండలంలోని కుంటపలిల్లో శనివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బూర్జువా పార్టీలకు ఓట్లు, సీట్లపై ఉన్న ఆసక్తి ప్రజాసమస్యల పరిష్కారంలో లేదని విమర్శించారు. కొద్ది రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలకు జిల్లావ్యాప్తంగా పత్తి, మొక్కజొన్న, తదితర పంటలు దెబ్బతిని రైతులు పెద్దఎత్తున నష్టపోయారని తెలిపారు. సరిపడా యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతుండగా అధికార పార్టీలు పట్టించుకోవడం లేదన్నారు. ప్రజాసమస్యలపై కార్యాచరణ రూపొందించి పోరాటాలు నిర్మించాలని శ్రేణులకు సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోనె కుమారస్వామి, డివిజన్ కార్యదర్శి మంద రవి, మండల కార్యదర్శి ఇస్మాయిల్, నాయకులు రాంచందర్, రవి, అశోక్, శ్రీను, కొమురయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



టైర్ పేలిన బస్సు వద్ద ప్రయాణికులు

సంగెం : మండలంలోని తీగరాజుపల్లి–గవిచర్ల గ్రామాల నడుమ శనివారం అన్నారం నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనక టైరు పేలి అదుపు తప్పింది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. టైరు పేలి భారీ శబ్దం చోటు చేసుకోవడంతో డ్రైవర్ వెంటనే అప్రమత్తమై బస్సును అదుపు చేశారు. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 61 మంది ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నల్లబెల్లి : దుర్గాదేవి విగ్రహానికి పూజ చేస్తున్న అర్చకులు, భక్తులు



## ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం కొనసాగాయి. చెన్నారావుపేట మండలంలోని ఎల్లాయగూడెంలోని మాధవనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహానికి భక్తులు పూజలు నిర్వహించారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. దుగ్గొండి మండలంలోని మండపాల్లో దుర్గాదేవిని లలితా త్రిపుర సుందరీదేవిగా అర్చకులు అలంకరించారు. గిర్నిబావిలోని బీరప్ప ఆలయంలోని విగ్రహానికి కురుమ కులస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్లబెల్లి మండల కేంద్రంలో, నారక్కపేటలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారిని లలితా పరమేశ్వరి దేవిగా అలంకరించారు. సంగెంలోని సంఘమేశ్వరాలయంలో గణపతి, నవగ్రహ సహిత చండీహోమం చేపట్టారు. రుద్ర హవనం, శ్రీసూక్త, మూలమంత్ర హవనం చేశారు.



సంగెం : చండీహోమం చేస్తున్న అర్చకులు, భక్తులు



దుగ్గొండి : గిర్నిబావి బీరప్ప ఆలయంలో..

## వైభవంగా బతుకమ్మ సంబురాలు



నెక్కొండ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పర్వతగిరి : ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో..

నెక్కొండ : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మండల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు, సీఏలు బతుకమ్మ ఆడి సందడి చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం రాపాక కిరణ్‌కుమార్ సంబురాలకు హాజరై మాట్లాడారు. బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయన్నారు.

పర్వతగిరి : స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులు, సిబ్బంది బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. కార్యక్రమంలో ఏపీఓ సుశీల్‌కుమార్, ఏపీఎం రాజేశ్, సీసీలు కొమురయ్య, సుధాకర్, సాంసన్, దేవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే బీసీ రిజర్వేషన్లు



సీఎం, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేశ్

నర్సంపేట : తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించడం చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిద్దన రమేశ్ తెలిపారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో చెన్నారావుపేటలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నట్లు తెలిపారు. బీసీలు రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలనే ఆలోచనతో రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టాలన్నారు. అనంతరం బాణాసంచా కాల్చి సంబురాలు చేపట్టారు.

## బాధిత రైతులను ఆదుకోవాలి

● న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజేందర్



నర్సంపేట : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నర్సంపేట : అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను పరిహారం అందించి ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ అనుబంధ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ముందు శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. వేలాది రూపాయలు అప్పు తెచ్చి పెట్టుబడి పెట్టిన రైతులకు నిరాశే ఎదురైందన్నారు. ప్రభుత్వం నష్టాన్ని సర్వే చేయించి రైతులకు పరిహారం అందించాలని, సరిపడా యూరియా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కుల తిరుపతి, రాష్ట్ర నాయకుడు జి.కృష్ణ, జిల్లా నాయకులు పాణి, మల్లన్న, కిషన్, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి గౌర్రె ప్రదీప్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### పెట్రోల్ బంక్ ప్రారంభం



బంక్‌ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ డీఎం ప్రసూనలక్ష్మి

నర్సంపేట : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ స్థానిక డిపో పరిధిలో ఏర్పాటు చేసిన భారత్ పెట్రోల్ బంక్‌ను డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. పెట్రోల్ బంక్‌లో నాణ్యమైన ఇంధన సదుపాయం, మంచి మైలేజ్, మెరుగైన ఇంజన్ పనితీరును పొందాలన్నారు. బంక్‌లో తాగునీటి సౌకర్యం, వాష్‌రూమ్స్ సౌకర్యంతో పాటు ఫ్రీ ఎయిర్ చెకప్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్, బంక్ నిర్వాహకులు రాయరాకుల సారంగం, వినీత్, ఆర్టీసీ డిపో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.